క్లుప్తంగా

పల్లె కిషోర్‌కుమార్‌కు నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పల్లె కిషోర్‌కుమార్

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న పల్లె కిషోర్‌కుమార్‌కు పాన్ ఇండియన్ జాతీయ అవార్డు వరించింది. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీలు కోదండరాం, టి.జీవన్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడారు. తబల కళాకారుడిగా, సింగర్‌గా, సమాజ సేవకుడిగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచినందుకు పాన్ ఇండియన్ జాతీయ అవార్డు 2024ను అందుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో త్రిబుల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీత గజల్ శ్రీనివాస్, పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు చిలుమల బాల్‌రెడ్డి, సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వ్యవస్థాపకుడు పద్మకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో నూతనకల్‌తో పాటు తాళ్లసింగారం సబ్‌స్టేషన్ పరిధిలోని టీక్యాతండా, సోమ్లాతండా, తాళ్లసింగారం గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ ప్రణయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, అందుకు వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

18న కంటి వైద్యశిబిరం

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఈనెల 18న వరంగల్‌కు చెందిన మ్యాక్సీ విజన్ శరత్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 01గంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డుదారులు, జర్నలిస్టులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లగచర్ల సంఘటన వెనుక కేటీఆర్ హస్తం

భానుపురి (సూర్యాపేట) : లగచర్ల సంఘటన వెనుక కేటీఆర్ హస్తముందని ఎన్ఎస్‌యూఐ ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సాయిఓంకార్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కొడంగల్ నియోజకవర్గాన్ని కేటీఆర్ దత్తత తీసుకున్నారని, ప్రకటనకే పరిమితం చేసి అటువైపు చూడకపోవడంతో నియోజకవర్గం అభివృద్ధి చెందలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఆ ప్రాంతం అభివృద్ధికి కంపెనీలు తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రయత్నిస్తే ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు, కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించి విధ్వంసం సృష్టిస్తున్నారని అన్నారు.

పాఠశాలకు బ్యాండు బహూకరణ



బ్యాండు బహూకరించిన అంజయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు అదే పాఠశాలలో పనిచేస్తున్న రికార్డ్ అసిస్టెంట్ నాతి అంజయ్య తన తల్లి చంద్రమ్మ జ్ఞాపకార్థంగా బ్యాండ్ డ్రమ్స్‌ను శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అంజయ్యను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలకు బ్యాండు అందజేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు కల్పన, నాగయ్య, యాదయ్య పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

తిరుమలగిరి : వరికోత యంత్రాల యజమానులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరికోతలు చేయాలని మండల తహసీల్దార్ హరిప్రసాద్, వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వరికోత యంత్రాల (హార్వెస్టర్ల) యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, ఏఈఓ వెంకట్‌రెడ్డి, ఏపీఎం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న ప్యాడీ క్లీనర్ల కొరత

- ధాన్యం విక్రయాలలో ఇబ్బందులు పడుతున్న రైతులు
- ప్రైవేట్‌గా గాలిపంకాలను ఆశ్రయిస్తున్న రైతులు
- అన్ని కేంద్రాలలో సరిపడా ఏర్పాటు చేయాలని వేడుకోలు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్ల లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 19ఐకేపీ కేంద్రాలు, నాలుగు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాలకు ప్యాడీ క్లీనింగ్ చేసేందుకు ప్రతి కేంద్రానికి ఒక ప్యాడీ క్లీనర్‌ను యంత్రాన్ని అందించారు. అయితే ఈ సీజన్‌లో కేంద్రాలకు ధాన్యం అధిక మొత్తంలో రావడంతో రైతులు ధాన్యాన్ని క్లీనింగ్ చేస్తేనే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టింది. అలాగే వ్యవసాయశాఖ అధికారులు ప్యాడీ క్లీన్ చేసిన తర్వాతే ధాన్యం తేమ శాతాన్ని చూస్తున్నారు. ఐకేపీ కేంద్రాలకు ధాన్యం రావడంతో పాటు ఒకటే ప్యాడీ క్లీనర్ యంత్రం ఉండటంతో పాటు, అవి సక్రమంగా పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో ప్యాడీ క్లీనర్ రోజుకు 100నుంచి 150బస్తాల వరకు మాత్రమే ధాన్యాన్ని శుభ్రం చేస్తుంది. అది కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా ఉంటేనే. ధాన్యాన్ని త్వరగా క్లీన్ చేయాలనే ఉద్దేశంతో కొంత మంది రైతులు విధిలేని పరిస్థితుల్లో ట్రాక్టర్లకు ఏర్పాటు చేసిన గాలిపంకాలను ఆశ్రయిస్తున్నారు. గాలిపంకాల వద్ద ధాన్యాన్ని శుభ్రం చేయిస్తే వారు గంటకు రూ.800 నుంచి రూ.1000వసూలు చేస్తున్నారు. అలాగే ప్యాడీక్లీనర్ ద్వారా ధాన్యాన్ని శుభ్రం చేస్తే ముగ్గురు కూలీలు అవసరం ఉంటుంది. కానీ గాలిపంకాల వద్ద ధాన్యాన్ని శుభ్రం చేయడానికి 5నుంచి 6గురు కూలీలు అవసరం ఉంటుంది. దీంతో రైతులపై అదనంగా ఆర్థికభారం పడుతుంది. ఐకేపీలకు ధాన్యం ఎక్కువ వస్తుండడంతో ప్యాడీ క్లీనింగ్ చేయడం ఇబ్బందిగా మారిందని, ప్రభుత్వం అదనంగా ప్యాడీ క్లీనర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



కొత్తగూడెం ఐకేపీలో ట్రాక్టర్ పంకాతో వడ్లు తూర్పారపడుతున్న రైతులు



ఐకేపీలో ప్యాడీ క్లీనర్‌తో ధాన్యం తూర్పారపడుతున్న రైతులు

అదనంగా ప్యాడీ క్లీనర్లను ఏర్పాటు చేయాలి



ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనంగా ప్యాడీ క్లీనర్లను ఏర్పాటు చేయాలి. ప్యాడీ క్లీనర్ల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐకేపీలో ప్యాడీ క్లీనర్ కొరతతో రైతులు ప్రైవేటుగా ట్రాక్టర్ ఫ్యాన్ వద్ద గంటకు రూ.800 చొప్పున చెల్లించి వడ్లను శుభ్రం చేయించుకుంటున్నారు. ప్రభుత్వం ఐకేపీల్లో అదనపు ప్యాడీ క్లీనర్లను త్వరగా ఏర్పాటు చేసి రైతుల సమస్యలను తీర్చాలి.

– బండి సత్యనారాయణ, రైతు, కొత్తగూడెం

సన్న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలగిరి : రైతులు కొనుగోలు కేంద్రాలకు 17శాతం లోపు తేమ ఉండే విధంగా సన్న ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూర్యాపేట ఆర్డీఓ ఆర్.వేణుమాధవరావు అన్నారు. శనివారం సాక్షి దినపత్రికలో సన్నధాన్యం కొనుగోళ్ల ఆలస్యంపై కథనం ప్రచురితం కావడంతో శనివారం సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, అనంతారంలోని సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కొనుగోలు కేంద్రాన్ని మిల్లు ట్యాగింగ్ చేయించారు. అనంతరం కాంటాలు వేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.హరిప్రసాద్, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎం మధుసూదన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమశాతం పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

వరిపంట రక్షణపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పెన్‌పహాడ్ : వరిపంట రక్షణపై రైతులకు మల్లారెడ్డి విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు శనివారం అవగాహన కల్పించారు. రావేప్ శిక్షణలో భాగంగా దూపహాడ్ గ్రామంలో ఇన్ఫర్మేషన్ కార్నర్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటను దెబ్బతీసే పసుపు నట్ట నివారణపై విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం సమస్యపై విద్యార్థులు గ్రామంలో రైతులతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ కీటకం వల్ల వరి పంట ఉత్పత్తిలో తీవ్రనష్టం ఏర్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు పసుపునట్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యలను స్పష్టంగా అర్థం చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు దీలినా, స్నేహ, దివ్యశ్రీ, ప్రభ, గీతిక, లలితా, దుర్గాశ్రీ, హిత్రిక , కీర్తన, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

తిరుమలగిరి : సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు కోరారు. శనివారం మున్సిపాలిటీలో నిర్వహించిన సర్వే తీరును పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే డేటా ఎంట్రీని సోమవారం నుంచి చేయడానికి కంప్యూటర్లు, ఇతర సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బుచ్చిబాబు, తహసీల్దార్ హరిప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



తిరుమలగిరిలో సర్వేపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవరావు

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయడానికి ఈ సర్వే ఎంతోగానో ఉపయోగపడుతుందని, అందుకు ప్రజలు సర్వే నిర్వహిస్తున్న అధికారులకు సహకరించాలన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని నిర్వహిస్తున్న సర్వేలో తహసీల్దార్ అమీన్‌సింగ్ పాల్గొన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలు ఎన్యుమరేటర్లకు సహకరించాలి

అర్వపల్లి : సమగ్ర కుటుంబ సర్వే సందర్భంగా ప్రజలు అందుబాటులో ఉండి ఎన్యుమరేటర్లకు తగు సమాచారాన్ని అందించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. శనివారం అర్వపల్లితో పాటు వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను ఆయనను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

సన్నధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలి

- సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు

అర్వపల్లి : రైతులు సన్న ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసుకుని కేంద్రాలకు తీసుకురావాలని, అలా తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తామని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. అర్వపల్లిలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి అధికారులు, రైతులు, నిర్వాహకులతో మాట్లాడారు. ప్రస్తుతం ఈ కేంద్రంలోని ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందని, బాగా ఆరబెట్టాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఏఓ పి.గణేష్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఏఈఓ శోభారాణి, వీఓఏ కృష్ణకుమారి, కేంద్రం నిర్వాహకురాలు లింగంపల్లి ఈశ్వరి, రైతులు, నిర్వాహకులు ఉన్నారు.



అర్వపల్లిలో అధికారులు, నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవరావు

రైతులు మద్దతు ధర పొందాలి

మద్దిరాల : రైతులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు సన్న ధాన్యానికి అందించే బోనస్ రూ.500లను పొందాలని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, సీఐ శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అమీన్‌సింగ్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వీరన్న శనివారం పరిశీలించి మాట్లాడారు. నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు.

నాగారం : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని వర్ధమానుకోట, ఫణిగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. రైతులు మద్దతు ధర పొందాలంటే నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. రైతులు 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను, సన్న ధాన్యానికి బోనస్ పొందాలన్నారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఐకేపీ నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఐలయ్య, రైతులు సోమయ్య, లింగమల్లు, మహేందర్, వెంకన్న, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



మద్దిరాల : కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్, సీఐ శ్రీనివాస్

సమానత్వాన్ని హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

భానుపురి (సూర్యాపేట) : రాజ్యాంగం ప్రజలందరికీ కల్పించిన సమాన హక్కులు, సమానత్వాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టూటౌన్ మహాసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన సమానత్వాన్ని లేకుండా చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలు, దళితులు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకుంటున్నారని అన్నారు. ప్రజల సంపద దోచుకునే వారిని ఎదిరించి ప్రజల పక్షాన పోరాటం చేసేది ఎర్రజెండా తప్ప మరి ఏ జెండా లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో రావడానికి అడ్డగోలుగా ఇచ్చిన హామీలన్నీటిని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, బొమ్మిడి లక్ష్మీనారాయణ, బోళ్ల వెంకట్‌రెడ్డి, నాగమణి, నెమ్మాది వెంకటేశ్వర్లు, యాదగిరిరావు, కోట గోపి, మట్టిపల్లి సైదులు, కొప్పుల రజిత, వెంకన్న, ఉయ్యాల నగేష్, వెంకన్న, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సృజన తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలీ రేట్లు పెంచాలని ధర్నా

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న వివిధ రకాల హమాలీల కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, బీఆర్‌టీయూల ఆధ్వర్యంలో శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రతి రెండు సంవత్సరాలకు మార్కెట్ కార్మికుల రేట్లు న్యాయబద్ధంగా పెంచాలన్నారు. గత సీజన్‌లో పెరగాల్సిన రేట్లు సకాలంలో పెంచని కారణంగా కార్మికులు నష్టపోయారని, పెరిగిన ధరలతో పోల్చితే కార్మికులకు వచ్చే వేతనం సరిపోవడం లేదన్నారు. మార్కెట్‌లో కార్మికులకు ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎల్గూరి శ్రీనివాస్, సందీప్, అరిగే శ్రీనివాస్, రాఘవులు, శంభు లింగం, హమాలీ నాయకులు లింగానాయక్, జానీ, శంకర్, చంద్రయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్‌లో ధర్నా చేస్తున్న కూలీలు

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు సిబ్బంది, నాయకులు

తుంగతుర్తి : సహకార కేంద్ర బ్యాంకు సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు జనరల్ మేనేజర్ కురువనాయక్ అన్నారు. సహకార బ్యాంకు వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులకు, రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందించే బ్యాంకు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సహకార లక్ష్మి ద్వారా తక్కువ వడ్డీకే సీనియర్ సిటిజన్స్ రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బ్యాంకు మేనేజర్ శ్రావణ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ షరీఫ్, పాలకుర్తి రాజయ్య, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, రైతులు పాల్గొన్నారు.

భూమిపై హక్కు కల్పించాలి

తుంగతుర్తి : తండ్రి వారసత్వ భూమిపై హక్కు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుమార్తెలు నిరసన వ్యక్తం చేశారు. వివరాల ప్రకారం.. మండలంలోని సంగెం గ్రామానికి చెందిన అన్నపర్తి ముత్తయ్యకు గ్రామంలో 1.22ఎకరాల భూమి ఉంది. అతడికి ఇద్దరు భార్యలు కాగా మొదటి భార్యకు ఐదుగురు కుమార్తెలు. రెండో భార్య నాగమ్మకు ఇద్దరు కుమార్తెలు. రెండో భార్య నాగమ్మ కుమార్తెల పెళ్లీలు మొదటి భార్య కుమార్తెలు కలిసి చేశారు. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం ముత్తయ్య తన భూమిని ఎవరికి చెప్పకుండా మరొకరికి అమ్మి రిజిస్ట్రేషన్ చేయించాడు. అంతకు ముందే మొదటి భార్య కుమార్తెలు స్థానిక తహసీల్దార్‌కు తన తండ్రి ఇతరులకు భూమి విక్రయిస్తే రిజిస్ట్రేషన్ చేయొద్దని వినతిపత్రం అందజేశారు. దీనికి తోడు వారు భూమిపై కోర్టులో కేసు వేశారు. అయినా తహసీల్దార్ దయానంద్ పట్టించుకోకుండా ఆ భూమిని విక్రయించిన బానోతు భూమిక పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో తండ్రి వారసత్వ భూమిపై తమకు హక్కు కల్పించాలని కుమార్తెలు కలెక్టర్‌ను వేడుకుంటూ జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌పై పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

'మాలల సింహగర్జన' కరపత్రాల విడుదల



సూర్యాపేట : సభ కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

సూర్యాపేట : హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభకు మాలలు భారీ ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోచైర్మన్, జిల్లా ఇన్‌చార్జ్ మేక వెంకన్న పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సింహగర్జన సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీ మనువాద తీర్పు అని, 30సంవత్సరాలుగా మాలలపై జరుగుతున్న దాడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోచైర్మన్ తాళ్లపల్లి రవి, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ నాగటి జోసెఫ్, జిల్లా కన్వీనర్ చందాదాస్, కోకన్వీనర్ గాజుల రాంబాయమ్మ, మద్దూరి కుమార్, చల్లమల్ల ప్రకాష్, అనుములపురి రామకృష్ణ, బొల్లెద్దు మహేందర్, బోస్, విజయ్, జ్యోతి, రమణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఎరమళ్ల రాములు, జిల్లా కన్వీనర్ వీర్జాల వేణు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన కో కన్వీనర్‌గా గంట యాకోబు, నియోజకవర్గం కన్వీనర్‌గా చింతపల్లి శేఖర్, మండల అధ్యక్షుడిగా గంట సందీప్, ఉపాధ్యక్షుడిగా పెరుమళ్ల జానీ, నాగారం మండల అధ్యక్షుడిగా జాన్‌వెస్లీ, ఉపాధ్యక్షుడిగా వంపు అమతిని ఎన్నుకున్నారు. సమావేశంలో మున్సిపల్ అధ్యక్షుడు గంట లక్ష్మణ్, మాల సంఘ నాయకులు మద్దెల ప్రభుదాస్, గంట సుమంత్, సాలమన్, దిలీప్, దావీద్ దీపు, రవి పాల్గొన్నారు.

వరలక్ష్మి మృతికి ఎమ్మెల్యే నివాళి



వరలక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గొండ్రాల అశోక్ తల్లి గొండ్రాల వరలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి శనివారం ఆమె మృతదేహానికి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వరిపొలం దగ్ధం



పొలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

ఆత్మకూర్(ఎస్) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఎకరం విస్తీర్ణంలో వరి పొలం దగ్ధమైంది. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని నెమ్మికల్లులో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వీరబోయిన యల్లయ్య వరిపొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి కోత దశకు వచ్చిన వరిపొలానికి అంటుకున్నాయి. దీంతో ఎకరం పొలం కాలి బూడిదైంది. స్థానికు సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఇతర పొలాలకు వ్యాపించకుండా ఆర్పివేశారు. ఘటనా స్థలాన్ని డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ పరిశీలించారు.

సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి

ఆత్మకూర్(ఎస్) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ యాతాకుల రాజన్న మాదిగ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏర్పడిన తర్వాతనే మాదిగ జాతికి ఆత్మగౌరవం, గుర్తింపు వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ములకలపల్లి రవిమాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ చింత వినయ్‌బాబు మాదిగ, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎర్ర వీరస్వామిమాదిగ, సీనియర్ నాయకులు కసుకుంట్ల వెంకన్న మాదిగ, కోడి వెంకటయ్య మాదిగ, బత్తుల వెంకట రాములుమాదిగ, మేడి కృష్ణమాదిగ, తిప్పర్తి గంగరాజు, వీరమల్ల నవీన్‌మాదిగ, పిడమర్తి వెంకటయ్య, పిడమర్తి రాములు, రాము, కార్తీక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న మాదిగ

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భానుపురి (సూర్యాపేట) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కేంద్ర గ్రంథాలయ శాఖలో 'పర్యావరణంపై – ప్లాస్టిక్ ప్రభావం' అనే అంశంపై స్థానిక జెడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రవణ్‌కుమార్, గ్రంథాలయ అధికారి వడ్డే శ్యామ్‌సుందర్‌రెడ్డి, లైబ్రేరియన్ ఎంపీ రంగారావు, విజయభాస్కర్, సృజన, ఉపాధ్యాయులు చారి, సుమతి పాల్గొన్నారు.

'డీఏపీ' ధరలు పెంచడం దారుణం

తుంగతుర్తి : డీఏపీ ఎరువుల ధరలను పెంచడం దారుణమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం బస్తా డీఏపీ ధర రూ.300 పెంచడంతో రైతాంగంపై తీవ్ర ఆర్థికభారం పడుతుందన్నారు. ఆయన వెంట నాయకులు గుండగాని రాములుగౌడ్, వెంకన్న, శ్రీనివాస్, సంతోష్ ఉన్నారు.

సభలను విజయవంతం చేయాలి

నూతనకల్ : సూర్యాపేట పట్టణంలో డిసెంబర్ 29, 30తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం కోరారు. శనివారం మండల కేంద్రంలోని తొట్ల మల్సూర్ స్మారక భవనంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బొజ్జ శ్రీను, తొట్ల లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య ఉన్నారు.

సామూహిక వ్రతాలు

అర్వపల్లి : మండలంలోని కొమ్మాల గ్రామంలో గల రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

అందుబాటులో ప్యారీ సూపర్ ఎరువు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం పీఏసీఎస్‌లో రైతులకు ప్యారీ సూపర్ ఎరువు బస్తాలు అందుబాటులో ఉన్నట్లు చైర్మన్ మారిపెద్ది మంగమ్మ, సీఈఓ ఊర సత్యనారాయణ శనివారం తెలిపారు. వంద బస్తాలు నిల్వ ఉన్నాయని, ఒక్కో బస్తా ధర రూ.600 ఉంటుందన్నారు.